క్లుప్తంగా

రేగోటి ఉషారాణికి సన్మానం



సన్మానం పొందుతున్న ఉషారాణి

మోత్కూరు : హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో మోత్కూరుకు చెందిన రేగోటి ఉషారాణి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అందుకు గాను నిర్వాహకులు ఆమె ఘనంగా సన్మానించారు. తెలుగు భాష గొప్పదనాన్ని కవిత రూపంలో చాలా చక్కగా ఆలోచింపజేశారని కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ శ్రీరామకృష్ణ, చంద్రమౌళి, నిత్యానందరావు, నందిని, డాక్టర్ సరళ, మామిడి హరికృష్ణ, ప్రముఖ కవయిత్రి వడ్డేపల్లి విజయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమత్స్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న సిబ్బంది

వలిగొండ : పాకిస్తాన్ ఉగ్రమూకలపై భారత సైనికులు పోరాడుతున్నందుకు వారికి మద్దతుగా మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి మోహన్‌బాబు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అందాల పోటీలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

చౌటుప్పల్ : రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల నిర్వహణను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఐద్వా సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోటీల పేరుతో అతివలను వివస్త్రలుగా చేసి బజారులో నెలబెట్టడమేనా నాగరికత అని ప్రశ్నించారు. మహిళా సమాజాన్ని కించపరిచేలా పోటీలు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందంటున్న పాలకులు కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలు ఎందుకు పెట్టాల్సి వస్తుందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, బత్తుల జయమ్మ, చింతల రజిత, యాదమ్మ, సంధ్య, దేవేంద్రమ్మ, పుష్ప, వీణ, ఇందిర పాల్గొన్నారు.

'సాక్షి' ఎడిటర్ ఇంటిపై పోలీసుల దాడి సరికాదు



నిరసన తెలుపుతున్న జర్నలిస్టు నాయకులు

భువనగిరి : సాక్షి ఎడిటర్ ఇంటిపై పోలీసులు దాడి చేయడం సరికాదని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబ అన్నారు. శుక్రవారం పోలీసులు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాలు జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైనచర్య అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపరాజు వెంకన్న,సుజావుద్దీన్, సిరిల్, షేక్ రసీద్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. శుక్రవారం పట్టణంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, యూనియన్ అధ్యక్షుడు కొండ మల్లారెడ్డి, చెక్క స్వామి, శ్రవణ్, సూరెపల్లి రజనీకాంత్, స్వామి, పాండు, పాల్గొన్నారు.

హరితహారం చెట్లు నరికివేత

మోత్కూరు : పట్టణం నుంచి గుండాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నరికివేశారు. మొక్కలను సంరక్షించాల్సిన అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. చెట్లను నరికిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మండల డెవలప్‌మెంట్ ఫోరం సభ్యుడు బయ్యని రాజు అధికారులను డిమాండ్ చేశారు.

తైక్వాండో కలర్ బెల్టు పోటీలు

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం తైక్వాండో కలర్ బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముగ్గురు ఎల్లో బెల్ట్, నలుగురు ఎల్లోవన్ బెల్టు, ఒకరు రెడ్ బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా సీనియర్ మాస్టర్ పట్టేడ సుధాకర్ క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకుడు పి.ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు



నల్లగొండ వైపు వెళ్లేందుకు ఎండలోనే నిల్చుని బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



ఎండ తీవ్రతకు తట్టుకోలేక చిన్న చెట్టు నీడన నిల్చున్న మహిళా ప్రయాణికురాలు

- బస్సుల కోసం ఎండలోనే నిలబడుతున్న ప్రయాణికులు
- హైవేకు ఇరువైపులా నిల్చొని అవస్థలు పడుతూ రాకపోకలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు హైవేపై బస్సు షెల్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోకి పలు డిపోలకు సంబంధించిన బస్సులు రాకపోవడంతో బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై నిల్చుంటారు. అయితే ప్రస్తుతం మండుతున్న ఎండలతో హైవే నిల్చుండాలంటే ప్రయాణికులు అవస్థలు పడాల్సివస్తుంది. దీంతో ప్రయాణాలు సాగించేవారు నరకం చూస్తున్నారు. బస్టాండ్‌కు వచ్చే కొన్ని డిపోల బస్సుల్లో కిక్కిరిసిన జనాలు ఉండడంతో చాలా మంది ప్రయాణికులు బస్టాండ్ ముందు జాతీయ రహదారిపై బస్సుల కోసం నిల్చుంటారు. అయితే హైవేకు ఇరువైపులా అటు హైదరాబాద్‌కు, ఇటు నల్లగొండ వైపునకు వెళ్లే మార్గాలలో ఎక్కడ కూడా కనీసం నీడ లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఎండలోనే వేచి ఉండాల్సివస్తుంది. ఆ క్రమంలో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఫలితంగా చాలామంది వడదెబ్బకు గురువుతున్నారు. బస్‌స్టేషన్‌లోకి అన్ని సర్వీసులు రాక, బయట బస్సులు ఎక్కుదామంటే మండే ఎండలో నిల్చోలేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు.

చెట్లు నరకడంతో తీవ్రమైన నీడ సమస్య..

గతంలో జాతీయ రహదారికి ఇరువైపులా చెట్లు ఉండేవి. అవి ప్రయాణికులకు చల్లని నీడను ఇచ్చేవి. 2020సంవత్సరంలో నాటిన చెట్లు తక్కువ కాలంలోనే భారీగా పెరిగి వృక్షాలుగా మారాయి. అయితే పట్టణ కేంద్రంలో నిర్మాణం చేపట్టనున్న అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా వివిధ రకాల పనులు ప్రారంభం అవ్వడంతో పట్టణంలో హైవే వెంట ఉన్న చెట్లను తొలగించారు. ఇక అప్పటి నుంచి హైవేపై నిల్వు నీడ కరువైంది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో విపరీతంగా ఎండలు మండుతుండడంతో ప్రయాణికులకు నీడ అవసరంగా మారింది. అయితే ఈ విషయంపై మాత్రం ఎవరూ దృష్టిసారించడం లేదు. ఆర్టీసీ, మున్సిపాలిటీ అధికారులు లేదంటే స్థానికంగా ఉన్న దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఎండాకాలం ముగిసే వరకైనా తాత్కాలికంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయించి ఎండ వేడిమి నుంచి కాపాడాలని పలువురు ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి



విపరీతమైన ఎండల మూలంగా బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై నిల్చునే పరిస్థితులు లేకుండా పోయాయి. నీడ లేకపోవడంతో ఇబ్బంది అవుతూనే ఎండలో నిలబడాల్సి వస్తుంది. ఎందరో ప్రయాణికులు వడదెబ్బకు గురవుతున్నారు. వేసవికాలం ముగిసే వరకు ఎవరైనా తాత్కాలికంగా చలువ పందిళ్లు ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– ఎండీ సోహెల్, విద్యార్థి

అన్ని డిపోల బస్సులు బస్టాండ్‌లోకి రావాలి



ఎండల కారణంగా జాతీయ రహదారిపై బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. హైవే మీదుగా వెళ్లే అన్ని జిల్లాల బస్సు సర్వీసులు బస్‌స్టేషన్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడు ప్రయాణికులకు ఎండ, వానలో నిల్చునే ఇబ్బందులు ఉండవు. ఈ దిశగా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను లోపకి వచ్చేలా చూడాలి.

– పోలోజు భాస్కరాచారి, ప్రయాణికుడు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు



రెవెన్యూ సదస్సులో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం) : రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. జిల్లా పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని కప్రాయపల్లి, కూరెళ్ల గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కూరెళ్లలో నిర్వహించిన సదస్సును ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో రైతులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. భూభారతి చట్టంలో రైతులు సమస్యలపై అప్పీలు చేసుకునే అవకాశం చట్టంలో కల్పించబడినట్లు ఆయన తెలిపారు. అనంతరం రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ వి.లావణ్య, వలిగొండ తహసీల్దార్ శ్రీనువాసరెడ్డి, మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్యయాదవ్, డీటీ ఎండీ షఫీయొద్దీన్, ఆర్ఐలు వై.మల్లిఖార్జునరావు, పాండు, మండల సర్వేయర్ స్వప్న, సిబ్బంది సంజయ్, నవనీత, వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో బాధపడకుండా చూడాలి



మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

భువనగిరి : జిల్లాలో ఎవరూ రక్తహీనతతో బాధపడకుండా ఎప్పటికప్పుడు మందులు అందజేయాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, జిల్లా కేంద్ర ఆస్పత్రుల ఫార్మసిస్టులకు, అనిమీయా ముక్త్‌భారత్, కుటుంబ నియంత్రణపై ఒక్క రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గుర్తించిన గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలతో పాటు అర్హులైన స్త్రీలకు ఐరన్ టాబ్లెట్స్ ఇవ్వాలన్నారు. కుటుంబ నియంత్రణకు సంబంధించి మెడిసిన్స్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డాక్టర్ వీణ, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, సీనియర్ ఫార్మసీ అధికారి సత్యవతి, డిప్యూటీ డెమో అంజయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ భువనగిరి సత్యనారాయణ, ఫార్మసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదింటి ఆడపడుచులకు వరం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



వలిగొండ : కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

వలిగొండ : పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా 67మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని పేద ప్రజలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన సాగు నీటి కాలువలో బునాదిగాని కాల్వకు రూ.269కోట్ల నిధులు కేటాయించి త్వరలో కాల్వ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు సరఫరా చేస్తున్న ధాన్యంలో రైస్ మిల్లు యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ధాన్యం నాణ్యత, తడిసిందని, తాలు సాకుతో బస్తాకు 4 కిలోల నుంచి 6కిలోల వరకు కోత విధిస్తున్నారని ఎమ్మెల్యేకు రైతులు సమాచారం ఇవ్వడంతో మండలంలోని వెల్వర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని మిల్లు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్, తుమ్మల యుగంధర్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, చెరుకు శివయ్య, పలుసం సతీష్, బొల్ల శ్రీనివాస్, నాగేశ్వర్, మల్లేష్, సత్తిరెడ్డి, సహదేవ, దానయ్య, కిష్టయ్య, సాయి, పౌర సరఫరాల శాఖ అధికారులు హరికృష్ణ, రోజారాణి, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్ రూరల్ : గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సంస్థాన్ నారాయణపురం : ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చౌటుప్పల్ రూరల్ : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దామెర గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లకు కనీసం బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణంలో నాసిరకంగా పనులు చేయడంతో ప్రారంభానికి ముందే బీటలు వారడాన్ని గమనించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పబ్బు రాజు, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ సందీప్‌కుమార్, నాయకులు చింతల సాయిలు, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, తహసీల్దార్ హరికృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

సంస్థాన్ నారాయణపురం : నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.25లక్షలతో చేపట్టిన అండర్ డ్రెయినేజీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.6.45లక్షలతో నిర్మించిన ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుత్త ఉమాదేవిప్రేంచందర్‌రెడ్డి, లింగస్వామి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, బుజ్జి, నాగరాజు, నర్సింహ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఆత్మకూరు (ఎం) : కరపత్రాన్ని విడుదల చేస్తున్న తహసీల్దార్ వి.లావణ్య

ఆత్మకూరు(ఎం) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తహసీల్దార్ వి.లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కూరెల్లలో ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాని ఆమె విడుదల చేసిన మాట్లాడారు. విద్యార్థుల ఉన్నత ప్రమాణాలను కాపాడడం కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి గొప్పదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న ఉచిత వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ, హెచ్‌ఎం కట్టా రమేష్, మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్యయాదవ్, మాజీ చైర్మన్ గడ్డం అశోక్, ఆర్ఐ వై.మల్లిఖార్జునరావు, పద్మ పాల్గొన్నారు.

మోటకొండూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన అందుతుందని ఎంఈఓ రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే 6వ తరగతి నుంచి 9వతరగతి విద్యార్థులకు ఈ నెల 15 నుంచి నెలాఖరు వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఇండోర్, ఔట్‌డోర్ క్రీడలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మొర బాలగంగాధర్‌రెడ్డి, చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కలకోట రాజగోపాల్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆచంట భాగ్యశ్రీ, మంచాల భవాని, నాతి మల్లేశంగౌడ్, విశ్వరూపం ఉన్నారు.

శారాజిపేటలో బడిబాట కార్యక్రమం

ఆలేరురూరల్ : మండలంలోని శారాజిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తుప్పరి జ్యోతిరాణి ఆధ్వర్యంలో శుక్రవారం బటిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పీఈటీ గడసంతల మధుసూదన్, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పుట్టల జ్యోతి, గ్రామస్తులు రచ్చ రామ్‌నర్సయ్య, నసీరుద్దీన్, కృష్ణారావు, రామచందర్, కాంతారావు, మధుసూదన్, దివాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమీల

భువనగిరి : మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సార్ప్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీల అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సార్ప్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు పనిచేసే ప్రదేశంలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షకురాలు లక్ష్మి, సిబ్బంది సరిత, రాజేష్, కవిత, కృష్ణవేణి శోభ తదితరులు పాల్గొన్నారు.

'గుట్ట'లో సైడ్ బోర్డులు ఏర్పాటు

యాదగిరిగుట్ట : మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తున్న సుందరీమణులు ఈ నెల 15న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఇందుకోసం పట్టణం మరింత అందంగా కనిపించేందుకు ఆయా ప్రాంతాల్లో సైడ్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ సీఐ కృష్ణ శుక్రవారం వెల్లడించారు. ప్రధానంగా ఆలయ కల్యాణకట్టా, లక్ష్మీపుష్కరిణీ, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వంటి ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



గుట్టలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేయనున్న సైడ్ బోర్డులు

హక్కుల సాధనకే కలెక్టరేట్ ముట్టడి

ఆలేరు : దివ్యాంగుల హక్కుల సాధనకు ఈ నెల 16,17తేదీల్లో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో కార్యక్రమానికి సంబంధించిన కరప్రతాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దాసు, నగేష్, శేఖర్, సిద్ధులు, గణేష్, భాస్కర్, తులసయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్ : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16, 17తేదీల్లో నిర్వహించే కలెక్టరేట్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కొలనిపాక నాగయ్య, వెంకటేశం, మహ్మద్ గుంసీ, పాండు, ఇస్తారి, కిష్టయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సర్వే



మోత్కూరు : లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

మోత్కూరు : ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులైన వారికి వర్తింపజేసేందుకు క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు భువనగిరి ఆర్డీఓ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసాలకు క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించి విచారించారు. ఆయన వెంట మండల ఏఓ వడ్డేమాన్ కీర్తి, సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా అర్హుల గుర్తింపు

తుర్కపల్లి : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హుల గుర్తింపు పారదర్శకంగా జరుగుతుందని తహసీల్దార్ దేశ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపూరం, మంచిరోనిమామిడ్లి, దయ్యాంబండ, గ్రామాల్లో ఇండ్ల లబ్ధిదారుల నివాస గృహలను పరిశీలించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి మధు, గ్రామస్తులు ఉన్నారు.

భారత్ సైన్యానికి మద్దతుగా ర్యాలీ

యాదగిరిగుట్ట : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం భారత్ విజయవంతంగా పూర్తి చేయాలని కోరుతూ భారత్ సైన్యానికి మద్దతుగా పట్టణంలో యువకులు శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేయడం బాధాకరమన్నారు. ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు, హిందుత్వ వాదులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, పట్టణ ప్రజలు

సంక్షిప్త సమాచారం

20న న్యాయ విజ్ఞాన సదస్సు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 20న న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవీలత కోరారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన న్యాయ సేవ అధికార సంస్థ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై సదస్సుల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ అధికారి సయ్యద్ మోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉగాది పురస్కారాలు ప్రదానం

మోత్కూరు : పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో స్వచ్ఛంద సేవలతో పలు రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారికి 2025 ఉగాది పురస్కారాలు శనివారం అందజేయనున్నట్లు మోత్కూరు విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ ఎం.బ్రహ్మాచారి శుక్రవారం తెలిపారు. పలు రంగాలలో సేవలు అందిస్తున్న 30మంది మోత్కూరు నేస్తాలకు ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పాల్గొని అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని సింగన్నగూడం వద్ద 11కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11.30గంటల వరకు హౌజింగ్‌బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీ, సింగన్నగూడెం, బైపాస్ రోడ్డుకు ఇరుపక్కల పవన్ మోటార్స్ షోరూం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మోత్కూరు : మోత్కూరు సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని మర్రిబావితండా, వాచ్యాతండా, వావిళ్లపల్లి, పుట్టపాక గ్రామాలలో ఉదయం 8నుంచి11గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దివ్య శుక్రవారం తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

భువనగిరి : పట్టణంలో జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కస్తూరి పాండు, ప్రధాన కార్యదర్శిగా బత్తిని రఘు, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణమోహన్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, సత్యనారాయణ, కోశాధికారిగా గుమ్మడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎండీ నజీర్ ఎన్నికయ్యారు.

కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే ఉత్తమం

రాజాపేట : కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమమని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న యాదగిరిగుట్ట కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో పాల్గొని మండల పరిధిలోని కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

స్నేహితుల దాతృత్వం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన దాసరి రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం జూలూరు జెడ్పీహెచ్ఎస్ 1996–97పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రవి పిల్లలకు రూ.32వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ దాతృత్వాన్ని చాటారు. కార్యక్రమంలో మెట్టు చంద్రశేఖర్, శ్రీకాంత్, రమేశ్, దయాకర్, పాంకుంట్ల బస్వయ్య, బాలరాజు, శ్రీశైలం, కొండల్, వెంకటేశ్, సత్యనారాయణ ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవ తేదీలు ఖరారు

ఆలేరు : పట్టణంలోని శ్రీకనకదుర్గా మాత ఆలయ పదో వార్షిక ఉత్సవాలకు సంబంధించిన తేదీలు ఖరారైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొలుపుల హరినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగన్న జూన్ 4,5,6 తేదీలు అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తం నిర్ణయించారని ఆయన తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు బేతి రాములు, నీలం వెంకటస్వామి, మంగ నర్సింహులు, తునికి దశరథ, సముద్రాల సత్యం, మల్‌రెడ్డి, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మోటకొండూర్ : కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగదివ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాటేపల్లి, నాంచారిపేట, కదిరేణిగూడెం గ్రామాల్లో పీపీసీ సెంటర్‌ను క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిర్వాహకులతో మాట్లాడారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

శ్రీసరస్వతీ విగ్రహం ఏర్పాటు

రాజాపేట : మండంలోని రఘునాథపురం ఉన్నత పాఠశాలలో శ్రీసరస్వతి దేవి విగ్రహాన్ని పాఠశాలకు చెందిన 1999–2000 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోజ్ కుమార్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.